క్లుప్తంగా

పత్తిలో సస్యరక్షణ చర్యలు



పంటను పరిశీలిస్తున్న ఏఈఓ రామకృష్ణ

మద్దూరు(హుస్నాబాద్‌): వర్షాలు కురుస్తున్న ఈ తరుణంలో పత్తిపంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ సూచించారు. మండలంలోని వల్లంపట్ల గ్రామంలో పత్తి పంటను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పత్తిపంటలో మొక్కల సాలుల మధ్య నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అధిక వర్షలతో పత్తి పంట పసుపు రంగులోకి మారే అవకాశం ఉందని, కాబట్టి 10గ్రాముల పోటాషియం నైట్రేట్‌ను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ కల్పన, రైతులు పాల్గొన్నారు.

స్మారక స్తూపాన్ని కూల్చొద్దు



మాట్లాడుతున్న గ్రామస్తులు

సిద్దిపేటరూరల్‌: రోడ్డు విస్తరణలో భాగంగా మండల పరిధిలోని తోర్నాల గ్రామం వద్ద ఉన్న స్మారక స్తూపాన్ని కూల్చొద్దని గ్రామస్తులు ఆర్‌అండ్‌బీ అధికారులను అడ్డుకున్నారు. తోర్నాల గ్రామస్తులు సోమవారం మాట్లాడుతూ 50యేళ్ల నుంచి ఉన్న పురాతన స్థూపాన్ని తొలగించడం దారుణం అన్నారు. గ్రామానికి గుర్తుగా ఉన్న స్థూపాన్ని కూల్చివేయకుండా రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు భూపతి, మాజీ వైస్‌ఎంపీపీ యాదగిరి, మాజీ సర్పంచ్‌ దేవయ్య, మహేశ్‌, రాజు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ నిర్ధారణ తప్పని సరి



మిరుదొడ్డి(దుబ్బాక): ఏడీఏ మల్లేశం

మిరుదొడ్డి(దుబ్బాక)/తొగుట(దుబ్బాక): రేషన్‌కార్డు లేని వారు రైతు రుణమాఫీ కోసం కుటుంబ నిర్ధారణ తప్పని సరిగా చేసుకోవాలని దుబ్బాక ఏడీఓ మల్లయ్య కోరారు. మిరుదొడ్డిలోని రైతు వేదికలో నిర్వహిస్తున్న కుటుంబ నిర్ధారణ కార్యక్రమాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రూ.2 లక్షలకు పైగా రుణాలు కలిగిన కుటుంబాల విషయంలో ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు రాగానే రైతులకు తెలియజేస్తామని చెప్పారు. మండల వ్యవసాయ అధికారి మల్లేశం, ఏఈఓలు పాల్గొన్నారు. అలాగే తొగుట రైతు వేదికలో రుణమాఫీ కుటుంబ నిర్ధారణ ప్రక్రియను పరిశీలించి మాట్లాడారు. సాంకేతిక కారణాల మూలంగా కొందరు రైతులకు రుణమాఫీ కాలేదన్నారు. కుటుంబ నిర్ధారణ ప్రక్రియను వేగవంతంచేయాలని ఆధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏఓ మోహన్‌, ఏఈఓ రాజేశ్‌ రైతులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



మాట్లాడుతున్న శ్రీనివాస్‌

మిరుదొడ్డి(దుబ్బాక): పండుగలను ప్రశాంతగా జరుపుకోవాలని, నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని సీఐ శ్రీనివాస్‌ హెచ్చరించారు. గణేశ్‌ నవరాత్రోత్సవాల సందర్భంగా భూంపల్లి పోలీస్‌ స్టేషన్‌లో సోమవారం ఆయన పలువురు నిర్వాహకులతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిర్వాహకులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎస్‌ఐ హరీశ్‌, సిబ్బంది హరికృష్ణ, రాజిరెడ్డి, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి కృషి

మర్కూక్‌(గజ్వేల్‌): ప్రభుత్వం గురుకుల పాఠశాలల అభ్యున్నతికి కృషి చేస్తోందని డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గల కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం, మరుగుదొడ్లు, తాగునీరు, ల్యాబ్‌ సదుపాయాల గురించి పాఠశాల ప్రత్యేక అధికారి భాగ్యలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఏడాది వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని, చదువులో వెనుకబడిన వారిని గుర్తించి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు.

వరద ముప్పు తప్పేదెన్నడో?



మల్లెచెట్టు చౌరస్తాలోని ప్రధాన రహదారిపై వరద నీరు

- ఇళ్లు, దుకాణాలకు ముంపు తప్పదా?
- వరద నీరు తరలింపునకు ముందుచూపు లేదు
- నాలాలు, కాలువలు కబ్జా చేసినా చర్యలు లేవు

హుస్నాబాద్‌: వర్షాలు కురిసినప్పుడల్లా వరదలు రావడం, ఇళ్లు, దుకాణాలు మునిగిపోవడం పరిపాటిగా మారింది. ఏళ్ల నాటి నుంచి నేటి వరకు వరద నీటి మళ్లించే చర్యలు లేకపోవడంతో ప్రతిసారి జనం నష్టాన్ని చవిచూడాల్సి వస్తోంది. ఆదివారం కురిసిన భారీ వర్షానికి హుస్నాబాద్‌ పట్టణం జలమయమైంది. ప్రధాన రహదారులు, కాలనీలు చిన్న పాటి చెరువులను తలపించాయి. వర్షం తగ్గిన తర్వాత దాదాపు 5గంటలపాటు వరద నీరు పట్టణాన్ని అతలాకుతలం చేసింది. వర్షాలు ఎప్పుడు కురిసినా మల్లెచెట్టు, అంబేడ్కర్‌ చౌరస్తాలతోపాటు లోతట్టు కాలనీలు నడుములోతు నీరు ప్రవహించడంతో జనం ఆందోళన చెందుతున్నారు. పట్టణంలో కొత్తగా ఇళ్లు నిర్మించుకునే వారు డ్రైనేజీని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడం, సెట్‌ బ్యాక్‌ కాకపోవడంతో వరద నీరు నిల్వ ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

కుంటల్లో కట్టడాలు...

పట్టణంలో కుంటలు, శిఖం భూముల్లో ప్రభుత్వ కార్యాలయాలను నిర్మించడంతో ఎక్కడికక్కడ వరద నీరు నిలిచిపోయి కార్యాలయాలు నీట మునుగుతున్నాయి. పటేల్‌ కుంటలో పోలీస్‌స్టేషన్‌, తీగల కుంటలో వ్యవసాయ మార్కెట్‌ కమిటీ కార్యాలయం, డిగ్రీ కళాశాల భవనం, మోడల్‌ స్కూల్‌, ప్రైవేట్‌ భవనాలు కుంటల్లో నిర్మించడంతో లోతట్టు ప్రాంతాలు వరద నీటిలో మునిగిపోతున్నాయి. వరద ముప్పుకు అడ్డుకట్ట వేసేందుకు సరైన ప్రణాళికలు లేవనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

> **కట్టు కాలువతో వరద నీటిని మళ్లిస్తాం**
>
> 
>
> పోతారం(ఎస్‌) నుంచి వచ్చే వరద నీటిని కట్టు కాలువ నిర్మించి ఎల్లమ్మ చెరువులోకి మళ్లిస్తాం. దీంతో వరద నీటిని పట్టణంలోకి రాకుండా శాశ్వత చర్యలు చేపడుతున్నాం. ఈ విషయాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్‌ దృష్టికి తీసుకెళ్లాం. మంత్రి ఆదేశాలతో రెవెన్యూ, ఇరిగేషన్‌ అధికారులతో కలిసి వరద మొదలవుతున్న ప్రాంతాన్ని పరిశీలించాం. శాశ్వత పరిష్కారం చూపాలని మంత్రి అధికారులను ఆదేశించారు.
>
> – ఆకుల రజిత, మున్సిపల్‌ చైర్‌పర్సన్‌

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు దాదాపు అన్నిమండలాల్లోను సోమవారం కూడా వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహించాయి. దీంతో కొన్ని గ్రామాలకు రహదారులు తెగిపోయాయి. రోడ్లపై నీరు ప్రవహించడంతో చాలాచోట్ల బస్సు సర్వీసులను రద్దు చేశారు. దీంతో ప్రజలు ఎక్కడివాళ్లు అక్కడే ఉండిపోయారు. చాలా గ్రామాల్లో ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. గోడలు కూలి ప్రజలు నిరాశ్రయులయ్యారు.



నంగునూరు(సిద్దిపేట): అక్కెనపల్లి బ్రిడ్జిపై నుంచి వాగు ఉధృతి

వర్షాలతో అప్రమత్తం

- తహసీల్దార్‌ సంజీవ్‌



గాగ్గిళ్లాపూర్‌ చెరువును సందర్శిస్తున్న సంజీవ్‌

మద్దూరు(హుస్నాబాద్‌): ఇటీవల కురుస్తున్న వర్షాలకు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్‌ సంజీవ్‌ సూచించారు. మండలంలోని గాగ్గిళ్లాపూర్‌తోపాటు పలు గ్రామాల్లోని చెరువులను, కుంటలను సోమవారం ఆయన పరిశీలించారు. కూలిన ఇళ్లను సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ఎవరూ ఉండవద్దన్నారు. మత్తడి పోసే చెరువుల వద్ద నిర్లక్ష్యంగా ఉండవద్దని, మండలంలో ఇప్పటి వరకు ఎనిమిది ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని చెప్పారు. వారి వివరాలను నమోదు చేసుకొని ఉన్నతాధికారులకు ఎప్పటి కప్పుడు తెలియజేస్తున్నామని చెప్పారు. అలాగే దూల్మిట్ట తహసీల్దార్‌ మధుసూదన్‌ మండల పరిధిలోని పలు గ్రామాల్లోని చెరువులను సందర్శించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రమేశ్‌, పంచాయతీ కార్యదర్శి తదితరులు ఉన్నారు.

బయటకు వెళ్లొద్దు

- సీఐ లతీఫ్‌

కొండపాక(గజ్వేల్‌)/దుబ్బాకటౌన్‌: భారీ వర్షాలు కురుస్తుండడంతో అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్ళవద్దని సీఐ లతీఫ్‌ కోరారు. శిథిలావస్థలో ఉన్న భవనాలు, చెట్లకింద నిలబడవద్దని, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్‌ స్తంభాలు, వ్యవసాయ బావుల వద్ద విద్యుత్తు వైర్లను తాకవద్దని హెచ్చరించారు. అలాగే దుబ్బాక సీఐ శ్రీనివాస్‌ మాట్లాడుతూ బ్రిడ్జిలు, చెరువులు, కాలువల వద్ద యువకులు సెల్ఫీల కోసం ప్రయత్నించవద్దని సూచించారు. కూడవెల్లి ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఆ దారిని మూసివేశామని చెప్పారు.



కోహెడరూరల్‌(హుస్నాబాద్‌): ఉధృతంగా ప్రహిస్తున్న మోయతుమ్మెద వాగు



కొండపాక(గజ్వేల్‌): సిర్సనగండ్లలోని మత్తడి పారుతున్న ఊరచెరువు



వర్గల్‌(గజ్వేల్‌): మీనాజీపేటలో దెబ్బతిన్న ఇల్లు



మర్కూక్‌(గజ్వేల్‌): ప్రవహిస్తున్న చెక్‌డ్యామ్‌

ఓపెన్‌ ప్లాట్ల యజమానులకు నోటీసులు

- మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ రజిత



మాట్లాడుతున్న మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ రజిత

హుస్నాబాద్‌: మున్సిపల్‌ సమావేశ మందిరంలో మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ ఆకుల రజిత అధ్యక్షతన సోమవారం పాలకవర్గ సభ్యుల అత్యవసర సమావేశం నిర్వహించారు. సభ్యుల అభిప్రాయంతో పలుఅంశాలపై తీర్మానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలో ఓపెన్‌ ప్లాట్ల యజమానులకు నోటీసులు జారీచేసి, చదును చేయకుంటే వారిపై మున్సిపల్‌ యాక్ట్‌ ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఖాళీ స్థలం ఉన్న యజమానులకు వీఎల్‌టీ విధించి పన్నులు వసూలు చేస్తామని చెప్పారు. నూతనంగా నిర్మిస్తున్న భవనాలు, పాత భవనాలు డ్రైనేజీపై వరకు నిర్మాణం చేపడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సెట్‌ బ్యాక్‌ కాకుండా నిర్మాణాలు చేపట్టడం వల్ల వర్షపునీరు నిలువ ఉండి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని వాపోయారు. సెట్‌ బ్యాక్‌ కాకుండా ఇళ్లు నిర్మించే వారిపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్‌ కమిషనర్‌ మల్లికార్జున్‌, వైస్‌ చైర్‌పర్సన్‌ అయిలేని అనిత, కౌన్సిలర్లు, కో–ఆప్షన్‌ సభ్యులు పాల్గొన్నారు.

ప్రమాదాలకు నిలయంగా మారిన రోడ్డు

- సీపీఎం నేత సత్తిరెడ్డి



రోడ్డును పరిశీలిస్తున్న నాయకులు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి నుంచి తిమ్మారెడ్డిపల్లి వరకు ఉన్న రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారిందని సీపీఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి అన్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకులతో కలసి గుంతలమయమైన రోడ్డును సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొమురవెల్లి నుంచి తిమ్మారెడ్డిపల్లి కమాన్‌ వరకు గల రోడ్డు గుంతలమయమై అనేక ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. గతంలో అధికారులకు వినతి పత్రాలు అందించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌ నుంచి వచ్చే మల్లన్న భక్తులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు కృష్ణారెడ్డి, రవీందర్‌, శారద, ప్రశాంత్‌, ఇస్తారి, మల్లేశం, రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

వైఎస్‌ఆర్‌ సేవలు మరువలేనివి



మిరుదొడ్డి(దుబ్బాక): వైఎస్‌ఆర్‌, ముత్యంరెడ్డి చిత్ర పటాల వద్ద నివాళులు



చేర్యాల(సిద్దిపేట): నివాళులర్పిస్తున్న కాంగ్రెస్‌ నాయకులు

- రాజశేఖర రెడ్డి వర్ధంతి
- విగ్రహాల వద్ద నేతల నివాళులు

ఉమ్మడి రాష్ట్ర మాజీ సీఎం, దివంగత మహానేత వైఎస్‌ రాజశేఖరరెడ్డి వర్ధంతిని జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లోను సోమవారం నిర్వహించారు. పలువురు నేతలు వైఎస్‌ఆర్‌ విగ్రహాలు, చిత్రపటాల వద్ద పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రజా సంక్షేమం కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.



చిన్నకోడూరు(సిద్దిపేట): చిన్నకోడూరులో..



దుబ్బాకటౌన్‌: దుబ్బాకలో..

అర్హులందరికీ రుణమాఫీ అందేలా చర్యలు

కొండపాక(గజ్వేల్‌): అర్హులందరికీ రూ.2లక్షల రుణమాఫీని పూర్తిస్థాయిలో అందించేందుకు అధికారులు కసరత్తు చేపట్టారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల వ్యవసాయాధికారి శివరామకృష్ణ మర్పడ్గలోని క్లస్టర్‌ రైతు వేదికలో రేషన్‌కార్డులు లేని వారిని, ఆధార్‌ కార్డుల్లో ఉన్న తప్పుల సవరణ కోసం పత్రాలు తీసుకుంటూ ఫొటోలను సరిచూసి ఆన్‌లైన్‌ నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 7వ తేదీ వరకు ప్రభుత్వం సవరణల కోసం అవకాశం కల్పించిందన్నారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా రోజుకో గ్రామంలో ఈ సవరణల కార్యక్రమం నిర్వహిస్తామని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ అనూష, రైతులు రవీందర్‌రెడ్డి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

అ‘పూర్వ’కలయిక



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

జగదేవ్‌పూర్‌(గజ్వేల్‌): మండలంలోని తిగుల్‌ గ్రామంలో 2003–04 సంవత్సరం పదో తరగతి పూర్తిచేసిన విద్యార్థులు సోమవారం ఓ ప్రైవేట్‌ ఫంక్షన్‌ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని, బాగోగాలు అడిగితెలుసుకున్నారు. అనంతరం ఆనాటి ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, చంద్రయ్య, మధుసూదన్‌ రావు, రాజిరెడ్డిని సన్మానించారు.

ఘనంగా శివపార్వతులకు పూజలు



పూజలు చేస్తున్న మహిళలు

కొండపాక(గజ్వేల్‌): కొండపాక మండలంలోని మర్పడ్గలోని విజయదుర్గ సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో శ్రావణం మాసం ఆఖరి సోమావతీ అమావాస్యను పురస్కరించుకుని మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. క్షేత్రం నిర్వాహకుడు హరినాథ శర్మ ఆధ్వర్యంలో శివపార్వతుల విగ్రహాలకు పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ పునరావాసకేంద్రానికి తరలింపు

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని లెనిన్‌నగర్‌లోని లోతట్టు ప్రాంతమైన పాతకాలనీకి చెందిన పది కుటుంబాలను పోలీసులు సోమవారం రాత్రి పంచాయతీలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ రాజు మాట్లాడుతూ భారీ వర్షసూచనతో పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు లోతట్టు ప్రాంతాలలో ఉన్న వారిని పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ లక్ష్మీనారాయణ, పోలీసులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

◆ అత్యవసరమైతేనే బయటకు రావాలి

బెజ్జంకి(సిద్దిపేట): వర్షాలు విస్తారంగా కురుస్తున్నందున ప్రజలు అత్యవసరమైతేనే బయటకు రావాలని మానకొండూర్‌ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కోరారు. మండలంలోని తోటపెల్లిలో జాలరి లక్ష్మణ్‌ గల్లంతైన కల్వర్టును కాంగ్రెస్‌ పార్టీ కరీంనగర్‌ పార్లమెంట్‌ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావుతో కలిసి సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లక్ష్మణ్‌ కోసం గాలింపు చర్యలు తీవ్రంగా జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో బ్లాక్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు దామోదర్‌, ఏఎంసీ చైర్మన్‌ పులి కృష్ణ, రత్నాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్‌ తదితరులు పాల్గొన్నారు.

◆ మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్‌: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పలు ప్రాంతాలలో వన్‌టౌన్‌ సీఐ లక్ష్మీబాబు, ట్రాఫిక్‌ సీఐ ప్రవీణ్‌కుమార్‌ సిబ్బందితో కలిసి వారం రోజుల క్రితం వాహనాల తనిఖీ నిర్వహించారు. తనిఖీల్లో 23మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని సోమవారం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రూ.35,500 జరిమానా, ఒకరికి రెండు రోజుల జైలుశిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు.

◆ అందుబాటులో ఉంటా..

గజ్వేల్‌రూరల్‌: ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నందున మున్సిపల్‌ పాలకవర్గం, అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు గజ్వేల్‌–ప్రజ్ఞాపూర్‌ మున్సిపల్‌ చైర్మన్‌ ఎన్‌సీ రాజమౌళి పేర్కొన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డులలో పర్యటించి అధికారులకు సూచనలు చేశారు. ప్రజ్ఞాపూర్‌లోని ఊర చెరువును పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్‌ కమిషనర్‌ గోల్కొండ నర్సయ్య, మున్సిపల్‌ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

◆ పేదల సంక్షేమానికి సీఎం కృషి

తొగుట(దుబ్బాక): పేదల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని కాంగ్రెస్‌ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని వెంకట్రావుపేట యువజన సంఘం నాయకుడు భానుచందర్‌ సోమవారం కాంగ్రెస్‌ పార్టీలో చేరారు. ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు పూర్వవైభవం తీసుకురావాలని కార్యకర్తలను కోరారు. కార్యక్రమంలో విజయ్‌రెడ్డి, అక్కం స్వామి, ప్రవీణ్‌, నరేందర్‌రెడ్డి, నిరంజన్‌, భూపాల్‌ రెడ్డి, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

◆ ‘సాహసం’ జిల్లా అధ్యక్షుడిగా రమణాకర్‌

గజ్వేల్‌: సామాజిక హక్కుల సంఘం(సాహసం) సిద్దిపేట జిల్లా శాఖ అధ్యక్షుడిగా గజ్వేల్‌కు చెందిన కానుగుల రమణాకర్‌ నియమితులయ్యారు. సోమవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్‌ ముప్పారం ప్రకాశ్‌కు నియామకపతారన్ని అందజేశారు.

◆ ప్రణాళికాబద్ధంగా కాలువలు నిర్మించండి

హుస్నాబాద్‌: అధికారులు ప్రణాళికాబద్ధంగా కాలువల నిర్మాణాలు చేపట్టి వరద నుంచి ప్రజలను విముక్తి చేయాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్‌ గౌడ్‌ డిమాండ్‌ చేశారు. సోమవారం బీఎస్పీ కార్యాలయంలో మాట్లాడుతూ భారీ వర్షాలను తట్టుకునేందుకు సరైన డ్రైనేజీ వ్యవస్థ లేదన్నారు. ఇష్టారాజ్యంగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టడం వల్ల రహదారులు, కాలనీలు జలమయం అవుతున్నాయని వాపోయారు. శంకర్‌, రాజు, సుధాకర్‌ తదితరులు పాల్గొన్నారు.

◆ రాష్ట్రస్థాయి టాపర్‌కు దక్కనున్న అవార్డు

దుబ్బాకటౌన్‌: ఇంటర్‌ ఒకేషనల్‌ కోర్సులో ప్రభుత్వ జూనియర్‌ కళాశాలకు చెందిన విద్యార్థి దోర్నాల సుకుమార్‌ ఎలక్ట్రీషియన్‌ కోర్సులో 1000మార్కులకు 994మార్కులు సాధించి రాష్ట్రస్థాయి టాపర్‌గా నిలిచాడు. ఆ విద్యార్థికి 4న హైదరాబాదులో ఇంటర్మీడియెట్‌ బోర్డు అధికారులు అవార్డును అందజేయనున్నారు.

◆ సిద్దిపేట వరకు బస్సులు నడపాలి

హుస్నాబాద్‌: హుస్నాబాద్‌ డిపోకు చెందిన బస్సులను సిద్దిపేట, హన్మకొండ వరకు నడిపేలా మంత్రి పొన్నం ప్రభాకర్‌ అనుమతి తీసుకోవాలని డిపో సూపరిండెంట్‌ శ్రీధర్‌కు సోమవారం బీఆర్‌ఎస్‌ నాయకులు వినతి పత్రం ఇచ్చారు. బస్సుల సంఖ్య పెంచాలని కోరారు. కార్యక్రమంలో అన్వర్‌ పాష, చంద్రయ్య, మల్లికార్జున్‌ రెడ్డి పాల్గొన్నారు.